
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
శనివారం 21 సెప్టెంబరు 2024



లింగాలఘణపురం మండలం నవాబుపేటలో చొప్పం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన వెంచర్



నిగ్గు తేలేనా..!

- ఎఫ్‌టీఎల్ హద్దుల ఏర్పాటుకు అనువైన సమయం
- కబ్జాకు గురవుతున్న చెరువు శిఖాలు
- చెరువులు, కుంటల ఆక్రమణలపై నియంత్రణ శూన్యం

లింగాలఘణపురం సెప్టెంబరు 20: గత కొన్నేళ్లుగా చెరువులు, కుంట శిఖాలు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చెరువు శిఖాల్లో వెంచర్ల పేరిట అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా కూడా అధికారులు అటువైపుగా కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంతో పాటుగా సూర్యాపేట రోడ్డు, హన్మకొండ రోడ్డు, హైదరాబాద్ రోడ్డు, సిద్దిపేట రహదారులకు ఆనుకుని ఉన్న శివారు ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు దర్జాగా కబ్జాకు గురవుతున్నప్పటికీ అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం. ఒకవేళ ఎక్కడైనా కబ్జాకు గురైనట్లుగా అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేసినా అలాంటి ఫిర్యాదులను బుట్టదాఖలు చేయడం తప్ప చర్యలు తీసుకోవడంలో ఆసక్తి చూపడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వాటిని నియంత్రించేందుకు ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేసి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఇదే సరైన తరుణమని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

జోరుగా కొనసాగుతున్న అక్రమణల పరంపర

గత పదేళ్లుగా రియల్‌ఎస్టేట్ భూమ్ ఊపందుకోవడంతో రియల్ వ్యాపారులు, బడాపారిశ్రామిక వేత్తలు జనగామ జిల్లా కేంద్రానికి చుట్టూ పరిసర గ్రామాల్లో వేలాది ఎకరాల భూములను కొనుగోలు చేసి వెంచర్ల పేరిట భూవ్యాపారాలు చేస్తున్నారు. అయితే పనిలో పనిగా కొందరు సందు దొరికినప్పుడల్లా చెరువు శిఖాలు, కుంటశిఖాలను తమ స్వాధీనంలోకి అక్రమంగా తెచ్చుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే వాటికి ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేశాకే ఆక్రమణలు నిజమా.. కాదా..? అనే విషయాలు నిగ్గుతేలుతాయని అధికారులు ప్రజల విజ్ఞప్తులను పరిశీలించకుండా తాత్సారం చేస్తున్నారు.

హద్దుల ఏర్పాటుకు అనుకూల తరుణం

రెండు మాసాలుగా జిల్లా వ్యాప్తంగా విస్తారమైన వర్షాలతో చెరువులు, కుంటలు చాలాచోట్ల నిండుకండను తలపిస్తున్నాయి. అయితే ఇప్పటికే చెరువు శిఖాలు, కుంట శిఖాల ఆక్రమణలతో పాటుగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రస్తుతం నిండు కుండలను తలపిస్తున్న నీటివనరులకు ఫుల్‌ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్) హద్దులను ఏర్పాటు చేయడానికి అనువైన తరుణమని సూచిస్తున్నారు.

అక్రమాలపై పట్టింపు శూన్యం

జిల్లాలోని 12 మండలాల పరిధిలో 965 చెరువులు ఉండగా ఇందులో సుమారు 100 చెరువుల వరకూ రహదారుల పక్కనే ఉండటం గమనార్హం. ప్రధానంగా రహదారుల పక్కనే ఉన్న చెరువులను లక్ష్యంగా చేసుకుంటున్న కొందరు రియల్ వ్యాపారులు నీటివనరుల పక్కనే ఉన్న భూములను కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని జనగామ, లింగాలఘణపురం, బచ్చన్నపేట, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, దేవరుప్పుల, పాలకుర్తి మండలాల పరిధి రహదారి పక్కన గ్రామాలకు చెందిన చెరువులు, కుంటశిఖాలు ఆక్రమణకు గురవుతున్నట్లు తెలుస్తోంది.

అక్రమాలపై కలెక్టర్ దృష్టిసారించాలి

రహదారుల పక్కన చెరువు శిఖాల అక్రమాలు, ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమనిర్మాణాలపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు క్షేత్రస్థాయి అధికారుల కనుసన్నల్లో అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శల నేపథ్యంలో కలెక్టర్ రంగంలోకి దిగితే అక్రమాల నిగ్గుతేలే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




నెత్తుటి చరిత్ర

- మావోయిస్టు ఉద్యమానికి నేటికి 20ఏళ్లు
- పోరాటంలో కీలక నేతలను కోల్పోయిన దళాలు
- ఉద్యమ యోధులను బలితీసుకున్న కరోనా
- రాష్ట్ర కార్యదర్శి సహా పలువురు కేంద్ర, రాష్ట్ర కమిటీ నేతల మృతి
- ఇటీవలి ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగిన ఓరుగల్లు విప్లవయోధులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 27మందికిపైగా అజ్ఞాతంలోనే
- ఆటుపోట్ల మధ్య అవిర్భావ వేడుకలకు సిద్ధమైన మావోయిస్టులు

విప్లవాల పురిటి గడ్డ ఓరుగల్లు.. ఎన్నో నక్సల్స్ ఉద్యమాలకు వేదికగా నిలిచిన ప్రాంతం. నాటి పీపుల్స్‌వార్ నుంచి నేటి మావో యిస్టుల వరకు ఎంతోమంది పోరాటానికి మద్దతుగా నిలిచిన నేల. ఆపద వస్తే అడవి నుంచి అన్నలు వస్తారని ఎదురుచూసే అణగారిన ప్రజలున్న పోరుగడ్డ. నక్సల్స్ ఉద్యమానికి ఊపిరినిచ్చిన ఓరుగల్లు గడ్డపైనే తెలంగాణ తొలి ఎన్‌కౌంటర్ జరిగింది. నాటి నుంచి నేటి వరకు ఎంతోమంది యోధులు చిందించిన నెత్తురు ఓ చరిత్రను రాసింది. అయితే ప్రభుత్వంతో చర్చలు విఫలమైన అనంతరం 2004 సెప్టెంబరు 21న అప్పటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్‌తో పాటు మరో రెండు విప్లవ సంఘాలు విలీనమై సీపీఐ (మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. నాటి నుంచి నేటి వరకు మావోయిస్టులు పోరుబాటను వదల్లేదు. ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లు. ఓవైపు ప్రభుత్వం నుంచి అణచివేతలు.. మరోవైపు కరోనా లాంటి విపత్కర పరిస్థితులను ఎదురొడ్డారు. తుపాకీతూటాతో రాజ్యాధికారం సాధించాలన్న లక్ష్యంతో పోరుబాట సాగిస్తున్న క్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరిభూషన్‌తోపాటు అనేక మంది మావోయిస్టులు కరోనాకు బలయ్యారు. 20ఏళ్ల మావోయిస్టు ఉద్యమ ప్రస్థానంలో ఎంతో మంది మావోయిస్టు నేతలు, మిలిటెంట్లు, ఇన్‌ఫార్మర్లతో పాటు పోలీసులు సైతం రక్తం చిందించారు.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



వివరాలు 7వ పేజీలో..



విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

లక్ష్యాన్ని ఎంచుకొని ఉద్యోగాలు సాధించాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, సెప్టెంబరు 20: యువత లక్ష్యాన్ని ఎంచుకొని ఉద్యోగాలు సాధించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టర్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, గ్రంథాలయం, ఎయిడెడ్ స్కూల్‌ను సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయంలో భూ రికార్డు పత్రాలను అప్లోడ్ చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. ఆనంతరం ఎయిడెడ్ స్కూల్లో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ల్యాండ్ రికార్డ్ ప్రోగ్రాం ద్వారా ల్యాండ్ స్కానింగ్ ప్రక్రియను పైలట్ ప్రాజెక్టు కింద మొదటగా జనగామ మండలాన్ని తీసుకొని మొదలు పెట్టడం జరిగిందన్నారు. ప్రతీ రోజు 2000 పత్రాలను స్కానింగ్ చేస్తూ ఇప్పటి వరకు 40% పూర్తి చేశారన్నారు. గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కాలికంగా అనుకూలమైన భవనాలను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. యువత గ్రూప్ ఉద్యోగాలు సాధించేందుకు కావల్సిన వనరులు కల్పిస్తామన్నారు. విద్యార్థులు తెలుగు మాధ్యమంలో కూడా యూపీపీఎస్సీ ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందన్నారు. 100% ఉత్తీర్ణత సాధించడమే కాకుండా 10/10 జీపీఏ సాధించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకన్న, ఈడీఎం గౌతంరెడ్డి, డీటీ జగన్నాయక్, హెచ్‌ఎం శోభా కిరణ్, గ్రంథాలయ నిర్వాహకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తికి అరుదైన గౌరవం



- మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు
- ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గం
- హర్షం వ్యక్తం చేసిన స్థానిక ప్రజలు

పాలకుర్తి, సెప్టెంబరు 20 : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నడుం బిగించి విస్నూరు దేశ్‌ముఖ్‌పై తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లోని కోఠి మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరును రాష్ట్ర ప్రభుతం ఖరారు చేసింది. శుక్రవారం కేబినేట్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టేందుకు ఆమోదం తెలిపారు. నిరంకుశ విధానాలు, రాజరిక ఫ్యూడల్ వ్యవస్థలకు వ్యతిరేకంగా తెలంగాణలో ఎన్నో ప్రజా ఉద్యమాలు వచ్చాయి. దీనిలో భాగంగా చాకలి ఐలమ్మ, కొమరంభీం, రాంజీ గోండు తదతర పోరాట యోధులు ఎందరో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా స్వయం పాలన, ప్రజాస్వామ్య పరిరక్షణకై తమ తమ పంథాలో పోరాటాన్ని చేశారు. హైదరాబాద్‌లోని మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టడంతో యావత్ తెలంగాణ ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ వర్ధంతి, జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం పోరాట చరిత్రను భావితరాలకు అందించేందుకు మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టడం పాలకుర్తి ప్రాంత ప్రజలకు గొప్ప వరమని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కేవీఎల్ఎన్ రెడ్డి

జనగామ రూరల్, సెప్టెంబరు 20: ప్రతీ ఒక్క బూత్‌లో 200 సభ్యత్వాలు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఎల్ఎన్ రెడ్డి అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు లద్దునూరి మహేశ్ యాదవ్ అధ్యక్షతన శుక్రవారం మండలంలోని ఓ పంక్షన్ హాల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేవీఎల్ఎన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ 8800002024 కు మిస్ కాల్ ఇస్తే సభ్యత్వం నమోదు అవుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో మార్క ఉపేందర్, భాస్కర్‌రెడ్డి, నామాల మహేందర్, అనిల్, శ్రీనివాస్, నవీన్, మధు, రవి, రాంకోటి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్‌లో గులాబీ జెండా ఎగరడం ఖాయం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో భేటీ

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 20: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటు తప్పదని, త్వరలోనే స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కేటీఆర్‌ను మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘన్‌పూర్‌లో కడియంను ప్రజలు ఓడిస్తారని, గులాబీ జెండా ఎగరడం ఖాయమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆ నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులతో త్వరలోనే విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

కాగా, రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య పరిస్థితులపై అధ్యయనంచేసి లోటుపాట్లను తెలుసుకోవడానికి బీఆర్ఎస్ పార్టీ నియమించిన త్రిసభ్య కమిటీకి అధ్యక్షుడిగా మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యను నియమించగా.. ఆయన కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో తనకు కీలక బాధ్యతలు అప్పగించిన కేటీఆర్‌కు, కేసీఆర్‌కు రుణపడి ఉంటానని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను పర్యటించి నివేదిక అందిస్తానని రాజయ్య పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ డొల్లతనాన్ని ఎండగడుతానని ఆయన తెలిపారు.

ఓటరు జాబితాలపై అభ్యంతరాలను తెలపాలి



సిద్ధేశ్వరాలయంలో పూజలు చేస్తున్న డీపీవో

మల్టీపర్పస్ వర్కర్లకు ఇన్సూరెన్స్

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

డీపీవో నాగపురి స్వరూప

బచ్చన్నపేట, సెప్టెంబరు 20: గ్రామ పంచాయతీలో వార్డుల వారీగా ఉంచిన ఓటరు జాబితాలపై అభ్యంతరాలుంటే ఈనెల 21 (శనివారం) లోగా తెలుపాలని డీపీవో స్వరూపరాణి కోరారు. శుక్రవారం బచ్చన్నపేట గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఓటరు లిస్టలను మార్పు చేసే అవకాశం లేదని, కేవలం ఆర్డీవో పరిధిలో కొత్త ఓటర్లను చేర్చాలన్నా, తీసివేయాలన్నా వారి పరిధిలో ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీకి చెల్లించే ఇంటి, నల్లా పన్నులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. జీపీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లకు ఇన్సూరెన్స్ చేయించటం జరుగుతుందని, ఏదైనా ప్రమాదం జరిగి మృతి చెందితే ఆకుటుంబం బజారున పడకుండా రూ. 15 లక్షల వరకు సంబంధిత ఇన్సూరెన్స్ కంపనీ చెల్లిస్తుందన్నారు. అలాగే డెంగీతో పాటు ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపడుతున్నట్లు వివరించారు. స్వచ్చతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా కస్తూర్బా పాఠశాలలో బాలికలకు పలు పోటీలు నిర్వహించటం జరిగిందన్నారు. సమావేశంలో ఎంపీడీవో మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయంలో పూజలు


ప్రముఖ శైవక్షేత్రమైన కొడవటూరు సిద్ధేశ్వరాలయంలో డీపీవో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆమెను సన్మానించారు.

నేడు జనగామకు కేంద్ర మంత్రి రాక

జనగామ రూరల్, సెప్టెంబరు 20: కేంద్ర మత్స్య, పశుసంవర్ధశాఖ, పాడిపరిశ్రమలు, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి మంత్రి జార్జ్ కొరియన్ శనివారం జనగామకు రానున్నట్లు బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో దశంమతరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేడు జనగామ బీజేపీ కార్యాలయంలో నిర్వహించే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా జార్జ్ కొరియన్ రానున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం లింగాల ఘనపూర్ మండలం నెలుట్లలో సామన్య ప్రజలతో సభ్యత్వ నమోదు చేయిస్తారన్నారు. కార్యక్రమంలో కొంతం శ్రీనివాస్, కేవీఎల్ఎన్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, ఊడుగుల రమేష్, శివరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జీవాల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రాధాకిషన్



మల్యాపూర్‌లో జీవాలకు వ్యాక్సిన్ వేస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

చిలుపూర్, సెప్టెంబరు 20 : మూగజీవాల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, డాక్టర్ వై. రాధాకిషన్ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్యాపూర్ పశు వైద్యశాలను సందర్శించిన ఆయన మొదటగా రికార్డులను పరిశీలించారు. అనంతరం జీవాలకు (గొర్రెలకు) పీపీఆర్ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డెయిరీలను సందర్శించి పాడి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా రాధాకిషన్ మాట్లాడుతూ, సీజనల్‌గా సంక్రమించే వ్యాధుల పట్ల గొల్లకురుమలు, పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని, రోగాలు సోకినట్లు గుర్తిస్తే తక్షణమే సమీపంలో ఉన్న పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనేశ్, సిబ్బంది భిక్షపతి, ఫయాజ్, రమేష్, జమాల్, నాగరాజు, పాడి రైతులు పోలేపల్లి రంజిత్‌రెడ్డి, పసుల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులు సమన్వయంతో పని చేయాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పాలకుర్తిలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, సెప్టెంబరు 20 : బీఆర్ఎస్ శ్రేణులు సమన్వయంతో పని చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ని రోజులు సహనంతో ఉన్నామని ఇక నుంచి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో పసునూరి నవీన్, మాచెర్ల ఎల్లయ్య, జరుపుల బాలూనాయక్, బండి కిరణ్, పాపారావు, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ బొబ్బాల అశోక్‌రెడ్డి, కత్తుల యాకయ్య ఉన్నారు.



టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కొమ్మూరి


జనగామ రూరల్, సెప్టెంబరు 20: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. జనగామలో జరుగుతున్న రాజకీయాలపై ఆయనకు ఈ సందర్భంగా కొమ్మూరి వివరించి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

వరంగల్ రైల్వే స్టేషన్‌లో 39 రైళ్లకు నో స్టాప్

- ఈనెల 25 నుంచి 29 వరకు అమలు
- కాజీపేట జంక్షన్‌లోనే హాల్టింగ్

7



మహబూబాబాద్‌లో నవోదయ, సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలి


ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నవోదయ, సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ ఇంటర్నేషనల్ నాయకుడు శనిగారపు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం హనుమకొండలోని ఎంపీ పోరిక బలరాం నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్, సునిల్, వెంకట్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల కోసం జీవితాన్ని ధారబోసిన కొండా లక్ష్మణ్‌బాపూజీ'

రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సరేఖ

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 20: ప్రజల కోసం తన జీవితాన్ని ధారబోసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్‌బాపూజీ అని దేవాదాయ, ధర్మాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి సందర్భంగా మంత్రి కొండా సురేఖ నివాళి తెలిపారు. జాతీయ ఉద్యమంలో తొలి, మలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటాల్లో, సాయుధ రైతాంగ పోరాటంలో సహకార ఉద్యమంలో లక్ష్మణ్‌బాపూజీ పాత్ర అద్వితీయమైనదన్నారు. క్విట్ ఇండియా ఉద్యమకాలంలో బ్రిటీష్ రెసిడెన్సీపై జెండా ఎగురవేశారన్నారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదిలేయడమేకాక, 96ఏళ్ల వయసులో తెలంగాణ కోసం దీక్ష చేసిన గొప్ప వ్యక్తి లక్ష్మణ్‌బాపూజీ అని కొనియాడారు. విప్లవ పంథాను అనుసరించడంలోనూ పార్లమెంటరీ పంథాలో సాగటంలోనూ ఆయన పాత్ర అమోఘమన్నారు. లక్ష్మణ్‌బాపూజీ ఆధ్వర్యంలోనే దేశంలోనే ప్రప్రథమంగా సహకార సంఘాలు పురుడు పోసుకున్నాయని గుర్తుచేశారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూం టెక్నాలజీకి సీఎం రేవంత్‌రెడ్డి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టినట్టు పేర్కొన్నారు.


బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌తో భేటీ అయిన సుందర్‌రాజ్ తదితరులు

సుందర్‌రాజ్ యూ టర్న్

- కేటీఆర్ వద్దకు తీసుకెళ్లిన వినయ్‌భాస్కర్
- పార్టీ మారనని మాజీ కుడా చైర్మన్ స్పష్టీకరణ


రాంనగర్, సెప్టెంబరు 20: బీఆర్ఎస్‌ను వీడాలనుకున్న మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యూటర్న్ తీసుకున్నారు. సుందర్‌రాజ్ పార్టీ వీడుతున్నట్లు రెండు రోజులుగా 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురించడంతో బీఆర్ఎస్ నేతలు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే పలువురు నేతలు పార్టీ వీడిన విషయం తెలిసిందే. పశ్చిమలో ఉన్న బలమైన బీసీ నేతను పోగొట్టుకోవడం సరికాదని నిర్ణయించి రెండురోజులుగా సుందర్‌రాజ్‌తో చర్చలు జరిపారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ శుక్రవారం సుందర్‌రాజ్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించాడు. భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని, నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, మంచి అవకాశాలు వస్తాయని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు సమాచారం. గతంలో మాదిరిగా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనాలని కేటీఆర్ సుందర్‌రాజ్‌తో అన్నట్లు తెలిసింది. నేతల మధ్య ఏమైనా అభిప్రాయభేదాలు ఉంటే అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించినట్లు సమాచారం. త్వరలోనే వరంగల్‌కు వస్తానని కేటీఆర్ తెలిపినట్లు సమాచారం. కాగా, కేటీఆర్‌తో భేటీ అయిన సుందర్‌రాజ్.. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని పేర్కొన్నట్లు తెలిసింది. పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఇవ్వాలని సుందర్‌రాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సూచించినట్లు సమాచారం.

ఫిట్స్‌తో ఇంటర్ విద్యార్థి మృతి

మడికొండ, సెప్టెంబరు 20: ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇంటర్మీడియేట్ విద్యార్థి మృతి చెందాడు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ చిగురుమామిడి మండలం నవాబుపేటకు చెందిన బుర్ర మల్లేశం కుమారుడు బుర్ర రామ్‌చరణ్ (18) కాజీపేట మండలం భట్టుపల్లిలోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం కళాశాల ఉపాధ్యాయుడు ముద్దం సంతోష్ ఫోన్ చేసి తమ కుమారుడికి ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడని, ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి రావాలని తెలిపాడు. ఆస్పత్రికి చేరుకున్న తమకు అప్పటికే తమ కుమారుడు మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి మల్లేశం పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

















నెత్తుటి చరిత్ర!

- మావోయిస్టు ఉద్యమానికి నేటికి 20ఏళ్లు
- పోరాటంలో కీలక నేతలను కోల్పోయిన దళాలు
- వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన 27మందికిపైగా అజ్ఞాతంలోనే
- ఆటుపోట్ల మధ్య ఆవిర్భావ వేడుకలకు సిద్ధమైన మావోయిస్టులు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

సీపీఐ(మావోయిస్టు) ఉద్యమానికి నేటితో ఇరువై ఏళ్లు నిండాయి. 2004లో పీపుల్స్‌వార్ అగ్రనేతలు నాటి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చల పేరిట మైదాన ప్రాంతాల్లోకి వచ్చారు. ఈ క్రమంలోనే పీపుల్స్‌వార్ రహస్య ప్రాంతాలపై గురి పెట్టిన పోలీసులు నక్సల్స్‌పై వల విసరటంతో తీవ్రంగా దెబ్బతిన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ నక్సల్స్ గ్రూపుతో దేశంలో బలమైన నక్సల్స్ ఉద్యమాన్ని నడుపుతున్న మరో రెండు విప్లవ సంఘాలైన మావోయిస్టు, కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీ), సీపీఐ (ఎంఎల్) నక్సల్బరీ గ్రూపులతో కలిసి విలీనమై అదే ఏడాది సెప్టెంబరు 21న సీపీఐ (మావోయిస్టు)గా ఏర్పడ్డాయి. ఇలా శనివారం నాటికి మావోయిస్టు పార్టీ ఆవిర్భవించి 20ఏళ్లు. అయితే నాటి చర్చల అనంతరం మావోయిస్టు ఉద్యమంపై అప్పటి ప్రభుత్వం ఉక్కుపాదం మోపటంతో మావోయిస్టు దండకారణ్య ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లోకి మకాం మార్చారు. రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని అడవులను కేంద్రంగా చేసుకుని నక్సల్స్ ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ వస్తున్నారు. అయితే తెలంగాణలో ముఖ్యంగా ఉత్తర ప్రాంతంలో పూర్వవైభవం కోసం మావోయిస్టులు రెండు దశాబ్దాలుగా చేస్తున్న ప్రయత్నాలు పూర్తిగా సఫలం కాలేకపోతున్నాయి. ఈ 20ఏళ్ల కాలంలో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలకు సరిహద్దులో ఉన్న భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో తమ ప్రాబల్యం పెంచుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తూ భారీ మూల్యాన్ని చెల్లించుకుంటోంది.

ఓరుగల్లులోనే తొలి ఎన్‌కౌంటర్..

2004లో మావోయిస్టు పార్టీగా ఆవిర్భవించిన తరువాత పదేళ్లు ఉమ్మడి రాష్ట్రంలో, మరో పదేళ్లు తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టులు ఉద్యమాలు చేస్తున్నారు. అయితే తెలంగాణ ఏర్పడితే తమ ఉద్యమానికి మరింత మద్దతు దొరుకుతుందని భావించిన మావోయిస్టులకు తొలి ఏడాదే భారీ షాక్ తగిలింది. అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మావోయిస్టులకు తూటాతో సమాధానం చెప్పింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం రంగాపూర్ అడవుల్లో 2015 సెప్టెంబరు 15న జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ నగరంలోని వడ్డెపల్లికి చెందిన బీటెక్ విద్యార్థిని శృతి అలియాస్ మహిత(23), ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన విద్యాసాగర్‌రెడ్డి అలియాస్ సాగర్ మృతి చెందారు. తెలంగాణ ఏర్పడిన తరువాత జరిగిన తొలి మావోయిస్టు ఎన్‌కౌంటర్ ఓరుగల్లులోనే జరగటం అప్పట్లో విప్లవకారులు, తెలంగాణవాదుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక 1991కాలంలో మావోయిస్టులు అనేక మంది కీలక నేతలను కోల్పోయారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్‌ఎస్‌యూ నేత పులి అంజయ్య అలియాస్ సాగర్ రాష్ట్రకార్యదర్శిగా ఎదిగి 1991ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆ తరువాత వరుసగా కేంద్ర కమిటీసభ్యులు నల్లా ఆదిరెడ్డి, శీలం నరేష్, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆ తరువాత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎదిగిన క్రాంతిరణదేవ్ అలియాస్ బక్కన్న, గుండెబోయిన అంజయ్య అలియాస్ బాలన్న, శెట్టిరాజ పాపయ్య అలియాస్ సోమన్న, గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్, తిప్పారపు రాములు అలియాస్ తాతా, బగే నాగేశ్వర్‌రావు అలియాస్ ప్రభాకర్ లాంటి కీలక నేతలు వేర్వేరు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందటంతో పార్టీ పెను సంక్షోభంలోకి వెళ్లింది.

కరోనాతో మావోయిస్టులు విలవిల

మావోయిస్టు పార్టీ గత 20 ఏళ్లలో ఎన్నడూ ఎదుర్కోని విపత్తును ఎదుర్కొంది. ఎన్నో ఎన్‌కౌంటర్లు, దాడులు, బాంబు బ్లాస్టింగులను ఎదుర్కొని ధైర్యంగా నిలిచి పోరాడిన మావోయిస్టు అగ్రనేతలు కరోనా నుంచి తప్పించుకోలేక పోయారు. దీంతో 2020-21 మధ్యకాలంలో పలువురు మావోయిస్టు కీలక నేతలు కరోనాతో మృతి చెందటం ఉద్యమానికి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా ఉన్న ఓరుగల్లుకు చెందిన అనేక మంది మావోయిస్టు అగ్రనేతలు మృత్యువాత పడ్డారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మాడగూడెంకు చెందిన మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషన్ 2021 జూన్ 21న కరోనాతోనే మృతి చెందారు. అలాగే కేంద్ర కమిటీ సభ్యులు కత్తి మోహన్‌రావు అలియాస్ ప్రకాష్ 2021 జూన్ 10వ తేదీన కరోనా బారిన పడి గుండెపోటుకు గురై మృతి చెందారు. అలాగే ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన మాడ్ ఏరియా కార్యదర్శి సిద్ధబోయిన సారక్క అలియాస్ భారతక్క 2021 జూన్ 22న కరోనాతోనే కన్నుమూసింది. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన మ్యాదరి భిక్షపతి 2021 జనవరి 18వ తేదీన అనారోగ్యానికి గురై మృతి చెందారు. వీరితో పాటు సుమారు 10మందికి పైగా మావోయిస్టు నేతలు కరోనా బారిన పడి మృతి చెందినట్లుగా సమాచారం. అలాగే మావోయిస్టు పార్టీ అగ్రనేతలు బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌తో పాటు అనేక మంది మావోయిస్టులు కరోనా బారిన పడ్డట్లు ప్రచారం జరిగింది. ఇలా ఎన్నిక సంక్షోభాలు ఎదురైనా ఎప్పటికప్పుడు కొత్త నాయకత్వాన్ని సృష్టిస్తూ ఆ లోటును భర్తీ చేసింది. కానీ ప్రస్తుతం ఆ కాలం నాటి రిక్రూట్‌మెంట్‌లు లేవు. దీంతో కరోనాతో కీలక నేతలను కోల్పోయినా మావోయిస్టులు వారి స్థానాలను భర్తీ చేయలేకపోతోంది. రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ మృతి తరువాత రెండున్నరేళ్ల వరకు నూతన కార్యదర్శిని నియమించలేకపోయింది. ఈ పరిణామాలు చూస్తుంటే కరోనా మహ్మారి మావోయిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపిందనేది స్పష్టమవుతోంది.

మరో 27మందికిపైగా అజ్ఞాతంలో..

20ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో 1991-94కాలం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొన్న మావోయిస్టులు 30ఏళ్ల తరువాత 2021-24లో అంతకంటే పెను సంక్షోభంలో కూరుకపోయారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రస్తుతం పోరుబాటలో ఓరుగల్లు నేతలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో దామోదర్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. ఇక కేంద్ర కమిటీ సభ్యుడిగా భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన గాజర్ల రవి అలియాస్ గణేష్ మావోయిస్టుల్లో కీలక నేతగా ఉన్నారు. ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో గణేష్ మావోయిస్టుల చర్చల ప్రతినిధిగా వెళ్లారు. అలాగే ములుగు జిల్లా గోవిందారావుపేట మండలం మొద్దులగూడెనికి చెందిన కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ ఏవోబీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ముప్పిడి బాబునావు, అంకీశ్వరం సారయ్యలతో పాటు పలువురు నేతలు కేంద్ర కమిటీలో కీలక బాధ్యతల్లో ఉన్నారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలో 18మందికి పైగా అజ్ఞాతంలో ఉండగా, భూపాలపల్లి జిల్లా నుంచి నలుగురు, ములుగు జిల్లా నుంచి ఐదుగురు మావోయిస్టులు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 27మందికి పైగా నక్సల్స్ మావోయిస్టు ఉద్యమంలో అజ్ఞాతంలో ఉన్నట్టుగా సమాచారం.

ఒక్కొరొక్కరుగా నేలకొరుగుతూ..

మావోయిస్టు ఉద్యమంలో ఓరుగల్లు నేతలే కీలకంగా ఉండటంతో.. ఎక్కడ ఏ అడవుల్లో తుపాకీ పేలినా ఇక్కడి పల్లెల్లో అలజడి మొదలయ్యేది. ఆ ఎన్‌కౌంటర్‌లో తమ వారున్నారా అని చెమ్మగిల్లిన కళ్లతో కుటుంబీకులు ఎదురుచూసేవారు. 2010లో అప్పటి ప్రభుత్వం మావోయిస్టు నేతలను గుర్తించింది. అందులో కరీంనగర్ నుంచి 60మంది అజ్ఞాతంలో ఉండగా, ఉమ్మడి వరంగల్ నుంచి అత్యధికంగా 80మంది అజ్ఞాతంలో అదీ కీలక పదవుల్లో ఉన్నట్లు గుర్తించారు. ఈ 14ఏళ్ల కాలంలో 60శాతం మంది మావోయిస్టులు లొంగిపోవటమో, ఎన్‌కౌంటర్‌లో మృతి చెందటమో, అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల కాలంలో ములుగు జిల్లా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అనేక మంది మావోయిస్టులు మృతి చెందారు.

- ఈ ఏడాది ఏప్రిల్ 16న ఛత్తీస్‌గఢ్ కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి జిల్లా చల్లగరిగే గ్రామానికి చెందిన సిరిపల్లి సుధాకర్ అలియాస్ మురళి అలియాస్ శంకర్‌రావు మృతి చెందారు. ఆయనతో పాటు ఆయన భార్య ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌కు చెందిన దాసెశ్వర్ సుమన అలియాస్ రంజిత కూడా మృతి చెందింది.
- ఏప్రిల్ 30వ తేదీన ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కేశినేని రవి అలియాస్ వినయ్ మృతి చెందాడు.
- జూలై 25వ తేదీన ములుగు- భద్రాద్రికొత్తగూడెం జిల్లా గుండాల, తాడ్వాయి మండలాల సరిహద్దుల్లోని దామెరతోగు, కరకగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి జిల్లా గణపురం మండలానికి చెందిన పీఎల్‌జీఏ సభ్యుడు అశోక్ అలియాస్ విజేందర్ మృతి చెందాడు.
- ఈనెల 5వ తేదీన ఛత్తీస్‌గఢ్ దంతేవాడ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ మృతి చెందాడు.

చెస్‌పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు20: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న హనుమకొండ టీడీడీ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు జిల్లాస్థాయి చెస్ పోటీలను వాల్ పోస్టర్‌ను శుక్రవారం హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి క్రీడాపోటీల నిర్వాకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. చెస్‌తో మేధోసంపత్తి చేకూరుతుందని, జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థులు రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న చెస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 4గురు బాలురు,



చెస్ పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

4బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి మార్కెట్లో తడిసిన మొక్కజొన్నలు

ఓపెన్ యార్డులో వరదనీటిలో కొట్టుకుపోయిన మక్కలు

కేసముద్రంలో 600 బస్తాలకుపైగా తడిచిన సరుకు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబర్ 20: ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో మార్కెట్లో తడిచిపోవడంతో రైతులు తల్లడిల్లిపోయారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 72మంది రైతులు 2,724 బస్తాల్లో 1,634 క్వింటాళ్ల మొక్కజొన్నలను విక్రయించేందుకు తీసుకువచ్చారు. కొంతమంది రైతుల సరుకుల్లో తేమశాతం ఎక్కువగా ఉండడంతో ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్నారు. వీరిలో కొంతమంది ఈ-నామ్ లాట్ తీసుకున్నవారు సైతం ఉన్నారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా కొద్ది నిమిషాలపాటు వర్షం కురవడంతో ఓపెన్ యార్డులో ఉన్న రైతులు తమ సరుకును కాపాడుకోలేకపోయారు. వర్షంలోనే తడుస్తూ మొక్కజొన్నలను దగ్గరకు కుప్పగా చేర్చారు. మహబూబాబాద్ మండలం వేమునూరు ఇందిరానగర్‌కు చెందిన భూక్య హుస్సేన్ ఎకరన్నరలో పండించిన మొక్కజొన్నలు తడిచిపోయాయి. గూడూరు మండలం పొనుగోడు రాములుతండాకు చెందిన భూక్య స్వామి, బానోత్ భద్రు, సాము, ఇనుగుర్తికి చెందిన బానోత్ వెంకన్నతో పాటు మరి కొంతమంది రైతుల సరుకులు పూర్తిగా తడిచి నష్టపోయారు. కొంతమంది టార్పాలిన్లు అందుబాటులో లేక నీటి వరదలో మొక్కజొన్నలు కొట్టుకుపోతున్నప్పటికీ చూస్తూ అలాగే ఉండాల్సిన దైన్యస్థితి నెలకొంది. దాదాపు 20 మంది రైతులకు చెందిన సుమారు 600 బస్తాల మొక్కజొన్నలు తడిచిపోయాయి.



కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో నీళ్లలో తడిచిన మొక్కజొన్నలను తీస్తున్న రైతు భూక్య హుస్సేన్

డిగ్రీ కళాశాల అడ్మిషన్ల మార్పులకు మరో అవకాశం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన డిగ్రీ విద్యార్థులు తాము అడ్మిషన్లు పొందిన కళాశాలలోనే కోర్సులను మార్చుకునేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి, దోస్త్, కళాశాల విద్యాశాఖాధికారులు మరో అవకాశం కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ఏ డిగ్రీ కళాశాలలో నైనా డిగ్రీ కోర్సుల అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు తమకు ఇష్టమైన కోర్సులకు మార్చుకుని చదువుకునేందుకు అవకాశం కల్పించినట్లు కమిషనర్ శ్రీదేవసేనా, చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రిలు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. సెప్టెం బరు 21 నుంచి 23 వరకు కళాశాలల కోర్సులు మార్పులు చేసుకోవచ్చునని వివరించారు. 24న తుది జాబితాను విడుదల చేస్తామని అధికారులు స్పష్టంచేశారు. వర్సిటీలోని అన్ని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు గమనించి తమ అర్హతల మేరకు తమకు ఇష్టమైన కోర్సులను అభ్యసించే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

23న కేయూలో సెనెట్‌హాల్‌లో సింపోజియం

హాజరుకానున్న హరగోపాల్, కోదండరామ్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం నేతృత్వంలో సెప్టెంబరు 23న ఉదయం 10గంటలకు డెకోడల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ స్టేట్-ఇష్యూస్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై సింపోజం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కేయూ ఆర్థశాస్త్ర విభాగాధిపతి, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షత వహిస్తారు. సింపోజంలో ముఖ్యఅతిథిగా ప్రముఖ సామాజిక వేత్త, సెంట్రల్ వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్, స్పెషల్ గెస్టుగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.కోదండరామ్, కీలక ఉపన్యాసకులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్థికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిలు పాల్గొననున్నారు.

డిగ్రీ ఇయర్ వైజ్ స్టూడెంట్స్‌కు పరీక్షలు నిర్వహించాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఇయర్‌వైజ్‌లో డిగ్రీ, పీజీ కోర్సులు చదివిన పాత విద్యార్థులందరికీ పరీక్షలు నిర్వహించాలని కేయూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు పి.ఉపేం దర్‌రెడ్డి జనరల్ సెక్రటరీ ఎం.ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కేయూ పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారిలను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలను అందచేశారు. వర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర కోర్సులు చదివిన విద్యార్థులు ఒక్కటి , రెండు సబ్జెక్టులు తప్పిపోయి డిగ్రీ ఉత్తీర్ణత సాధించలేకపోయారని వారికీ మళ్లీ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. అఖరు చాన్స్‌గానైనా డిగ్రీ పాత విద్యార్థులకు వర్సిటీ ఉన్నతాధికారులు ఆలోచించి పరీక్షలను నిర్వహించాలని కోరారు. అలాగే యూడీఎఫ్ ఫీజులను తగ్గించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఎంజీఎంలో అత్యాధునిక పరికరాల ఏర్పాటు

ఎంజీఎం అధికారులతో సమీక్షా సమావేశంలో వరంగల్ కలెక్టర్ సత్య శారద



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలు అందించేందుకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ముందుకొచ్చినట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి, ఆర్‌ఎంవో మురళి, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం సమయ్యలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్‌ఆర్ పనుల కింద వైద్య పరికరాల సరఫరా చేయడానికి పవర్ గ్రిడ్ ముందుకు రావడంపై కలెక్టర్ వారిని అభినందించారు. ఎంజీఎం ఆస్పత్రిలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పరికరాల వివరాల నివేదికలు సమర్పించాలని ఎంజీఎం సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, తహసీల్దార్ ఇక్బాల్, పవర్‌గ్రిడ్ జూనియర్ ఇంజనీర్ సీహెచ్.సంపత్ పాల్గొన్నారు.

ఓపీ ల్యాబ్‌లో రోగుల కష్టాలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ విభాగంలో రోగుల కోసం ప్రత్యేకమైన ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లోకి వెళ్లాలంటే రోగులు నరకయాతన అనుభవించాల్సిందే. రోగ నిర్ధారణకు అవసరమయ్యే సీబీపీ, ఎలక్ట్రోలైట్స్ షుగర్ పరీక్షల లాంటివి ఈ ల్యాబ్‌లో చేస్తారు. ప్రస్తుత సీజన్‌లో అధిక సంఖ్యలో రోగులు వస్తుండటంతో ఆ గదిలోకి పైకి ఎక్కాలంటే చుక్కలు కనబడుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగులు జారీ కింద పడుతున్నారని వాపోతున్నారు. గతంలో మందులు ఇచ్చే దగ్గరనే ఈ 47వ నెంబరు ల్యాబ్ ఉండేది. ఓపీ పక్కనే ఈ ల్యాబ్ ఉండటంతో చాలా సౌకర్యంగా ఉండేది. అధికారులకు ఏమైందో ఏమో కాని లేకుంటే తీసుకొచ్చి దూరాన ఏర్పాటు చేశారు. అది కూడా పైకి ఎక్కడానికి వీలు లేకుండా ఉందని రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎంజీఎం అధికారులు రోగులకు అనువైన చోటికి ఓపీ సేవలను దగ్గర ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎంజీఎంలో ఫిర్యాదుల పెట్టెలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రి పాలనను గాడిలో పెట్టేందుకు ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు. రోగులు తమకు కలుగుతున్న ఇబ్బందులను ఫిర్యాదుల రూపంలో రాసి ఈ బాక్సుల్లో వేయాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్ వీటిని స్వయంగా తెరిచి సమస్యలు తెలుసుకున్నారు. ఎంజీఎంలో పదికిపైగా ఇలాంటి పెట్టెలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఇప్పటివరకు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇంకా మెరుగైన ఫలితాల కోసం ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఓపీ కౌంటర్ల సంఖ్యనుకూడా పెంచాలని అధికారులను ఆదేశించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాలిక మృతదేహం తరలించడంలో వైఫల్యం

'ఎక్స్'లో సర్కారుపై కేటీఆర్ వ్యాఖ్యలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మృతి చెందిన గిరిజన బాలిక గీతిక (6)ను తరలించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. తన ఎక్స్ ఖాతాలో ఈ విషయంపై స్పందించారు. ప్రభుత్వ అంబులెన్స్ ఉండి కూడా గిరిజన బాలిక మృతదేహాన్ని స్వస్థలానికి తరలించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటన ప్రభుత్వానికి అవమానకరం అని అన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యానికి ఇంది పరాకాష్టగా మిగులుందన్నారు.

వరంగల్ రైల్వే స్టేషన్‌లో 39 రైళ్లకు నోస్టాప్

- ఈనెల 25 నుంచి 29 వరకు అమలు
- కాజీపేట జంక్షన్‌లోనే హాల్టింగ్

గిర్మాజీపేట, సెప్టెంబరు 20: వరంగల్ - కాజీపేట ఎఫ్ క్యాబిన్ - హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌ల మధ్య జరుగుతున్న మూడో లైన్ పనుల కారణంగా విజయవాడ - కాజీపేట - బల్లార్ష సెక్షన్‌లో ఈనెల 25 నుంచి 29 వరకు గరీబ్‌రథ్, వందేభారత్, గోదావరి, పద్మావతి, సింహపురి, తదితర 39 రైళ్లకు వరంగల్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ తాత్కాలికంగా ఎత్తివేసినట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈనాలుగు రోజుల పాటు గరీబ్‌రథ్, వందేభారత్, కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వరంగల్‌కు బదులుగా కాజీపేటలో ఆగుతాయని, ఇతర రైళ్లు కూడా యథావిధిగా కాజీపేటలో ఆగుతాయని వెల్లడించారు.

కాజీపేటలో ఆగే రైళ్లు ఇవే..

ప్రస్తుతం వరంగల్‌లో మాత్రమే స్టాప్ కలిగి కాజీపేటలో స్టాప్‌లేని విశాఖపట్టణం - సికింద్రాబాద్ - విశాఖపట్టణం గరీబ్‌రథ్ రైళ్లు ఈనెల 25 నుంచి 29 వరకు, షాలిమార్ - సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ 25న, కాకినాడటౌన్ - లింగంపల్లి - కాకినాడటౌన్ కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు 26, 27 తేదీల్లో, టాటా - యశ్వంత్‌పూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ 26న వరంగల్‌కు బదులుగా కాజీపేట రైల్వేస్టేషన్‌లో తాత్కాలికంగా ఆగుతాయని తెలిపారు.



యథావిధిగా కాజీపేటలో హాల్టింగ్

గూడూరు - సికింద్రాబాద్ - గూడూరు సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, విశాఖపట్టణం - సికింద్రాబాద్ - విశాఖపట్టణం గోదావరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, కాకినాడ పోర్ట్ - లింగంపల్లి - కాకినాడ పోర్ట్ గౌతమి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మణుగూరు - సికింద్రాబాద్ - మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మచిలీపట్టణం - బీదర్ - మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తాంబరం - హైద్రాబాద్ - తాంబరం చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తిరుపతి - కరీంనగర్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తిరుపతి - సికింద్రాబాద్ - తిరుపతి పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, నర్సాపూర్ - నాగర్‌సోల్ - నర్సాపూర్ నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నాలుగు రోజులు వరంగల్‌లో ఆగకుండా యథావిధిగా కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఆగుతాయని తెలిపారు. అలాగే విశాఖపట్టణం - మహబూబ్‌నగర్ - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శాలిమార్ - హైద్రాబాద్ - శాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్టణం - సాయినగర్‌షిర్డి - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, యథావిధిగా కాజీపేటలో ఆగుతాయని శ్రీధర్ తెలిపారు. సాయినగర్ షిర్డి - కాకినాడ పోర్ట్ - సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శాలిమార్ - సికింద్రాబాద్ - శాలిమార్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కాజీపేటలో ఆగుతాయని వెల్లడించారు. అలాగే యశ్వంతాపూర్ - నిజాముద్దీన్ - యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 22నుంచి అక్టోబరు 7వరకు ప్రస్తుత కాచిగూడ - కాజీపేట - బల్లార్ష - నాగపూర్‌కు బదులుగా కాచిగూడ - నిజామాబాద్ - ముద్కెడ్ - పింపల్ కుటి నాగపూర్ మీదుగా ప్రయాణిస్తుందని పేర్కొన్నారు.

వరంగల్‌లో పనిచేయలేం.. ఖమ్మం పంపించండి..

మంత్రికి రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల మొర

రాంనగర్, సెప్టెంబరు 20: వరంగల్ జిల్లాలో పనిచేయలేమని, తిరిగి ఖమ్మం జిల్లాకు పంపించాలని రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎదుట మొరపెట్టుకున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఖమ్మం జిల్లాకు చెందిన రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులను వరంగల్‌కు, ఇక్కడి వారిని ఖమ్మం పంపించారు. ఖమ్మం నుంచి బదిలీపై వచ్చిన అటెండర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ స్థాయి ఉద్యోగులు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఆగస్టు మొదటివారంలో వరంగల్‌కు వచ్చిన ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ రిజిస్ట్రేషన్ చేస్తే ఏమవుతుందోననే భయంతో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. నిబంధనల సాకుతో రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదు. ఆస్తుల క్రయవిక్రయాల్లో సబ్‌రిజిస్ట్రార్‌లు ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు సమాచారం. కాగా, కొద్దిరోజుల్లోనే వరంగల్‌లో పనిచేయలేమని గుర్తించిన ఉద్యోగులు.. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినట్లు సమాచారం. ఏ మాత్రం అవకాశం ఉన్నా తిరిగి ఖమ్మం పంపించాలని కోరినట్లు తెలిసింది.

ముగిసిన రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీలు

కాజీపేట, సెప్టెంబరు 20: కాజీపేటలో రైల్వే సేఫ్టీ కమిషనర్ మాదవి రైల్వే ట్రాక్‌ల తనిఖీలు శుక్రవారంతో ముగిశాయి. రెండురోజులుగా ప్రత్యేక ట్రాలీలో కాజీపేట నుంచి వరంగల్ మీదుగా తిరిగి హసన్‌పర్తి వరకు నిర్మించిన మూడో రైల్వేట్రాక్‌ను పరిశీలించారు. కాజీపేట - హసన్‌పర్తి కోమటిపల్లి వద్ద నిర్మించిన సొరంగమార్గం సైతం పరిశీలించారు. ఈ సొరంగమార్గం వద్ద సేఫ్టీ కమిషనర్ కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలుస్తోంది. సొరంగమార్గంతోపాటు మూడోలైన్ నిర్మాణం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఆదేశాలను జారీ చేసినట్లు రైల్వే ఉద్యోగులు తెలిపారు. సెఫ్టీ కమిషనర్ సొరంగమార్గం మూడోలైన్‌ల నిర్మాణంపై సంతృప్తి వ్యక్తం చేసినట్టు రైల్వే ఉద్యోగులు తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫై చేసిన అనంతరం ఈట్రాక్‌లపై ట్రయల్ రన్ చేయనున్నారని రైల్వే అధికారులు తెలిపారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి



అల్లం ప్రవీణ్ (ఫైల్)

గార్ల (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 20 : పిడుగుపాటుకు ఓ యువకుడు మృతి చెందగా, తల్లికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పాత పోచారంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని పాత పోచారం గ్రామానికి చెందిన అల్లం ప్రవీణ్ (22), తల్లి కోటేశ్వరితో కలిసి తమ భూమిలోని మిర్చి తోటలో పనులు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా గాలిదుమారం, వానతో పాటు ఉరుములు, మెరుపులతో వారు పనులు చేస్తున్న ప్రదేశంలో పిడుగుపడడంతో ప్రవీణ్ స్పృహతప్పి పడిపోయాడు. పక్కనే ఉన్న తల్లి కోటేశ్వరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన పక్కపొలం రైతులు ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం ఆటోలో ఖమ్మంకు తరలిస్తుండగా మృతి చెందాడు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ

జనగామ రూరల్, సెప్టెంబరు 20: జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల్లో రాయితీ ఇవ్వాలని కోరుతూ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) యూనియన్ నాయకులు శుక్రవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఇర్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ వెంటనే సర్క్యూలర్ జారీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెంటస్వామి, సురిగెల భిక్షపతి, వంగా శ్రీకాంత్‌రెడ్డి, కొత్తపల్లి కిరణ్ కుమార్, భాస్కర్, ఓరుగంటి సంతోష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

జనగామ రూరల్, సెప్టెంబరు 20: బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఏవో మన్సూరికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకుడు చిర్రా వీరస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్ పెంచి స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున అందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పండుగ హరీశ్ ముదిరాజ్, నిమ్మల కుమార్, గుర్రాల సురేశ్, శ్రీనివాస్, నాగేశ్ శ్రీకాంత్, సాంబరాజు, యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై విమర్శలు చేయడం సిగ్గుచేటు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 20: రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు వివాదస్పద వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అసత్య ఆరోపణలు చేసిన బీజేపీ నేతలు వెంటనే క్షమాపణ చెప్పాలని లేదంటే కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహానికి గురి కావలసి వస్తుందని హెచ్చరించారు. మోదీ, అమిత్‌షాల డైరెక్షన్‌లో బీజేపీ నేతలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలాగే ప్రవర్తిస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

మండలంలో భారీ వర్షం

కొడకండ్ల, సెప్టెంబరు 20 : మండలవ్యాప్తంగా శుక్రవారం రాత్రి సుమారు గంట సేపు కుండపోతగా భారీ వర్షం కురిసింది. దీంతో మండలకేంద్రంలో 68 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. కొద్దిరోజులుగా ఎండలు మండిపోతుండగా నేడు కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది.

అవకతవకలపై విచారణ జరపాలి

పీఏసీఎస్ సిబ్బంది, పాలకవర్గంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జనగామ రూరల్/రఘునాథపల్లి: సెప్టెంబరు 20: రఘునాథపల్లి మండలం నిడిగొండ పీఏసీఎస్‌లో అవకతవకలపై విచారణ జరపాలని శుక్రవారం పీఏసీఎస్ సభ్యులు, రైతులు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ సభ్యుడు రాంరెడ్డి మాట్లాడుతూ పీఏసీఎస్‌లో రుణము తీసుకున్న వారు కొంతమంది అప్పు చెల్లించి రశీదు పొందినప్పటికీ వారి పేర్లు రుణగ్రహిత జాబితాలో ఇప్పటికీ చూపడం లేదన్నారు. తక్కువ అప్పు తీసుకున్న వారిపై ఎక్కువ అప్పు ఉన్నట్లు చూపడం జరుగుతుందన్నారు. మరణించిన సభ్యుల పేర్లమీద అప్పు ఉన్నట్లు చూపిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు 554 మంది అప్పుదార్లలో.. కేవలం ఇద్దరికి మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి సీఈవో రాజ్‌కుమార్, మాజీ సీఈవో రాజయ్యలపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐలేశ్, దయానందరెడ్డి, రాములు, యాదగిరి, చంద్రయ్య, అంజనేయులు, మొహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పీఏసీఎస్ సభ్యులు, రైతులు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్, సెప్టెంబరు 20: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సంఘం నాయకులు కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వంగూరి రాములు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీ ఇవ్వదని ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు నేరుగా అందించాలన్నారు. కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ప్రమాద బీమా రూ. 10లక్షలు, సహజ మరణం జరిగితే రూ. 5లక్షలు మోటర్ సైకిల్, ఇతర సమస్యలను పరిష్క రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిట్యాల సోమన్న, జోగు ప్రకాశ్, తాండ్ర ఆనందం, గంగరబోయిన మల్లేశ్, నరసింహులు, రాములు యాదగిరి కృష్ణ, సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘు నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు శివునిపల్లి విద్యార్థుల ఎంపిక

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 20: మండలంలోని శివునిపల్లి హైస్కూల్ విద్యార్థులు సాఫ్ట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం కే రమేశ్, పీడీ కె.రవి తెలిపారు. రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు సాత్విక్, జీ. తేజ, డీ. చరణ్, బీ. ఇందు, జీ. వినయ్, బీ. మణి, ప్రసన్నలను శుక్రవారం అభినందించారు. వీరు ఈ నెల 22,23 తేదీల్లో సిరిసిల్లలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ జీ రాధిక, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు జొన్నల రాజేశ్వర్‌రావు, జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి భగత్, ప్రమోద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విధుల బహిష్కరించిన ఆరోగ్యశ్రీ ఉద్యోగులు

జనగామ రూరల్, సెప్టెంబరు 19: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు రెండో రోజు విధులను బహిష్కరించారు. శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమిత్రలకు డాటా ప్రాసెసింగ్ క్యాడర్ కల్పించాలని, జీవో నం.60 ప్రకారం రూ.22,750 వేతనం అమలు చేయాలని, ఆరోగ్యమిత్రల జీతభత్యాలు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా ట్రస్టు ద్వారా చెల్లించాలని, రాబోయే పీఆర్‌యస్‌లో కనీస వేతనం రూ. 35,000లతో పాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలన్నారు.

అదే విధంగా 16 సంవత్సరాలుగా పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య మిత్రలను తిరిగి పీహెచ్‌సీలో నియమించాలని, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా కల్పించాలని, ఉద్యోగులందరికీ హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చింతకింది రాంప్రసాద్, తాళ్లపల్లి చంద్రమౌళి, నల్ల రమేష్, మేకల నాగరాజు, కుసుమ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జనగామలో నటీనటుల ఎంపిక

జనగామ కల్చరల్, సెప్టెంబరు 20: నటనపై ఆసక్తి కలిగిన నటీనటులను ఈ నెల 22న జనగామలో ఎంపిక చేస్తామని కల్చరల్ క్రియేటివ్ ఛానల్ (సీసీసీ) ముఖ్య కార్య నిర్వాహకులు జి.కృష్ణ తెలిపారు. శుక్రవారం జనగామలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీసీ ఆధ్వర్యంలో రూపొందించే షార్ట్ ఫిలింలో నటించడానికి నటీనటులను ఎంపిక చేస్తున్నామని, నటనపై ఆసక్తి గల వారు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జనగామ జిల్లా కేంద్రంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న సీపీఐ పార్టీ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 98484 80442 నంబరులో అయిలా సోమనర్సింహాచారిని సంప్రదించాలన్నారు.

సీజేఐటీలో ఘనంగా ఇంజనీర్స్ డే



విద్యార్థులతో కలిసి సమావేశంలో పాల్గొన్న ఫాదర్ విజయపాల్‌రెడ్డి

జనగామ కల్చరల్, సెప్టెంబరు 20: జనగామ మండలం యశ్వంతాపురం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల (సీజేఐటీ)లో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఎఫ్ఐఈ చైర్మన్ డాక్టర్ ఎ.రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ సామాజిక సామర్థ్యం విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానంలోనే ఉందన్నారు. విద్యార్థులు తమలోని సాంకేతిక నైపుణ్యానికి మెరుగులు దిద్దే దిశగా పయనించాలని సూచించారు. గౌరవ అతిథులుగా పాల్గొన్న గిరిధర్, సీఎస్ఆర్‌కె ప్రసాద్ మాట్లాడుతూ దేశ ఉజ్వల భవిష్యత్తు విద్యార్థుల నైతిక విజ్ఞానం, సాంకేతిక నైపుణ్యతపై ఆధారపడి ఉన్నదన్నారు. కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమలోగల ఉపాయాలను కార్యరూపం దాల్చడానికి సాంకేతిక విజ్ఞానం దోహదపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికంగా ఎదగాలని, సమాజ శ్రేయస్సుకు కావలసిన విజ్ఞానానికి తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 20: జిల్లా కేంద్రంలో మిలాద్ సోషల్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువకులు రంగురంగుల దుస్తులు ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్, ఆర్టీసీ చౌరస్తా వరకు ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

మండల స్థాయి క్రీడా ఎంపికలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 20: ఈ నెల 25, 26 తేదీల్లో శివునిపల్లి హైస్కూల్‌లో నిర్వహించే 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడల ఎంపిక పోటీలు విజయవంతం చేయాలని ఎంఎన్ఓ కొమురయ్య కోరారు. శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్వహించిన పీఈటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని హైస్కూళ్ల 14 నుంచి 17 ఏళ్ల బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. 25న బాలుర, 26న బాలికలకు సెలక్షన్స్ పోటీలు నిర్వహిస్తారు. పోటీల్లో మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, హైస్కూళ్ల నుంచి విద్యార్థులను ఎంపిక పోటీలకు పీఈటీలు తీసుకు రావాలని కోరారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు కే రమేశ్, ఎం సంపత్, మండల కన్వీనర్ కొండ రవి, పీడీలు శ్రీనివాస్, జీ ప్రమోద్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్, సుధాకర్, చందర్, మంజుల, అశోక్, శ్రీనాథ్, శ్రీనికాంత్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఎస్‌జీఎఫ్ గేమ్స్

జనగామ కల్చరల్, సెప్టెంబరు 20: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను ఈ నెల 25, 26 తేదీలలో అండర్-14, 17 బాలబాలికలకు నిర్వహించాలని నిర్ణయించారు. బాలురకు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో, బాలికలకు పెంబర్తి జిల్లా పరిషత్ స్కూల్‌లో నిర్వహిస్తారని, ఆసక్తి గల వారు 83749 10159 నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రమాదవశాత్తు గోవు మృతి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 20: ప్రమాదవశాత్తు మెడకు కట్టిన తాడు ఉరిపడి గోవు మృతి చెందిన ఘటన శుక్రవారం డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డివిజన్ కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన చింత ఐలయ్య తాటికొండ రోడ్డులో పొలాన్ని కౌలుకు తీసుకొని పంట సాగు చేస్తున్నాడు. తన రెండు జర్సీ ఆవులను తాటికొండ రోడ్డులోని దేవాదుల రిజర్వాయర్ గుంతల పక్కన చెట్లకు కట్టేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం గోవుల వద్దకు వచ్చి చూడగా చెట్టుకు కట్టేసి ఉన్న ఒక గోవు గుంతలో ప్రమాదవశాత్తు జారిపడడంతో మెడకు ఉన్న తాడు ఉరిపడి మృతి చెందింది. గోవు మృతితో రూ. 80వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను కలిసిన నాయకులు

చిలుపూర్, సెప్టెంబరు 20: టీపీసీసీ అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్ గౌడ్‌ను, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాదం గట్టయ్య నేతృత్వంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మహేశ్‌గౌడ్‌ను కలిశారు. ఈకార్యక్రమంలో నారగోని పరమేశ్వర్, బోళ్ల రాజ్‌కుమార్, బానోత్ బాలరాజు, మారపాక దయాకర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

లింగాలఘణపురం, సెప్టెంబరు 20: విద్యాభ్యాసంపై ఎలా ఆసక్తిని పెంపొందించుకోవాలనే అంశంపై సైకియాట్రిస్ట్ డాక్టర్ వశిష్ట అవగాహన సదస్సును నిర్వహించారు. శుక్రవారం మండలంలోని బండ్లగూడెం కేజీబీవీ పాఠశాలను సందర్శించిన వైద్యుల బృందం బాలికా విద్యార్థులకు మానసిక పరిపక్వతను పెంపొందించుకోవడంతో పాటుగా ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రవితేజ, స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రఘునాథపల్లి, సెప్టెంబరు 20: మండల కేంద్రంలోని ఖిలాషాపూర్ క్రాస్ రోడ్డు వద్ద టాటా సుమో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 11 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనంచేసుకున్నారు. బియ్యంతో సహా వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బియ్యం తరలిస్తున్న భూక్యా రమేష్, మాలోతు వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని సస్పెండ్ చేయాలి

నర్మెట, సెప్టెంబరు 20 : కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని వెంటనే సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నర్మెట మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాటాడారు. ఈనెల 17న ప్రజాపాలన దినోత్సవంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పాల్గొనగా కొందరు కాంగ్రెస్ నాయకులు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సభా వేదికను దిగి పోవాలని రభస చేశారన్నారు. పార్టీలో ఉంటూ సొంత నాయకులపైనే గొడవ చేస్తున్న అసమ్మతి నాయకులు వేమళ్ల సత్యనారాయణ, ఎర్రమల్ల సుధాకర్, మానంపల్లి లింగాజీలను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నర్మెట గ్రామ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, మాజీ జడ్పీటీసీ గాదె మోహన్‌రెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు దేవులపల్లి భాగ్యలక్ష్మి, ముక్కెర రాజేష్, వలబోజు శ్రీనివాస్, తీగుళ్ల భూపతి, సంగి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు అంబేద్కర్ చిత్రపటాల అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 20: జ్ఞాన ప్రచార సభ ఆర్గనైజింగ్ సెక్రటరీ జింక బాబు, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు జలగం ప్రవీణ్‌లు శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ, ఆర్డీవో ధరంసోత్ వెంకన్నలకు వారి కార్యాలయాలలో అంబేద్కర్ చిత్రపటాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని రాసిన అంబేద్కర్ చిత్రపటం ప్రతీ ఇంట్లో, కార్యాలయంలో ఉండలానే లక్ష్యంతో అధికారులకు బహూకరించడం జరుగుతుందన్నారు. అంబేద్కర్ చలువ వల్లనే నేడు దేశంలో ప్రతీ ఒక్కరం స్వేచ్ఛ వాయువులు పీల్చుకోగల్గుతున్నామని వారు తెలిపారు. అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కంకణబద్దులు కవాలని అకాంక్షించారు. కార్యక్రమంలో బొస్కుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

లింగాలఘణపురం, సెప్టెంబరు20: గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య చర్యలపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జలంధర్‌రెడ్డి మండలంలోని కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీల ద్వారా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతో పాటుగా పచ్చదనం-పరిశుభ్రత, సురక్షిత తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రఘురామకృష్ణ, సూపరింటెండెంట్ సీతారాం నాయుడు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

లింగాలఘణపురం: గ్రామపంచాయతీలో నిధుల కొరత కారణంగా ఏర్పడుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీవో జలంధర్‌రెడ్డికి మండలానికి చెందిన కార్యదర్శులు టీపీఎస్‌పీఎఫ్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్ర వారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిధుల లేమి కారణంగా అత్యవసర పారిశుధ్య చర్యల కోసం కార్యదర్శులు తమ వేతనాల నుంచి డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోయారు. ట్రాక్టర్ ఈఎంఐలు, కరెంట్ బిల్లులు చెల్లించలేని దుస్థితిలో పంచాయతీలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రానున్న బతుకమ్మ, దసరా ఉత్సవాల నిర్వహణ కోసం పంచాయతీలకు నిధుల ను మంజూరు చేయాలని కోరారు.

డీఎంజేఏ జనగామ అధ్యక్షుడిగా నరేందర్

జనగామ రూరల్, సెప్టెంబరు 20: డిజిటల్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్(డీఎంజేఏ) నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనగామ అధ్యక్షుడు ఉప్పలంచి నరేందర్, ప్రధాన కార్యదర్శి పాలమాకుల జితేందర్, ఉపాధ్యాక్షులుగా బత్తిని అశోక్, దీకొండ హరీశ్, కోశాధికారి జీ కృష్ణ, సహాయ కార్యదర్శులుగా జేరిపోతుల ఉపేందర్, కార్యవర్గ సభ్యులుగా అంజయ్య, రాజు, ప్రవీణ్‌కుమార్, నవీన్‌చారి, ఓంకార్, అఫ్రోజ్, గౌరవ సలహాదారులు మాదంవెట్టి శివకుమార్, కిరణ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ ప్రస్తుతం మిడియా రంగంలో డిజిటల్ మీడియా ముందుకు దూసుకుపోతుందన్నారు. రానున్న రోజుల్లో డిజిటల్ మీడియాదే హవా పెరుగుతుందన్నారు. ప్రభుత్వాలు కూడా డిజిటల్ మీడియాను వర్కింగ్ జర్నలిస్టులుగా గుర్తించాలన్నారు.

పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలి

రఘునాథపల్లి, సెప్టెంబరు 20: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పొదల లవకుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం ఎంఈవో రఘునందన్ రెడ్డికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా లవకుమార్ మాట్లాడుతూ పాఠశాలల్లో మూత్రశాలలు అధ్వాన్నంగా ఉన్నాయని, మధ్యాహ్న భోజనం మెనూలో పేర్కొన్నట్టు విద్యార్థులకు అందించాలన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొడుగు రమేష్, సుద్దాల లక్ష్మణ్, రొయ్యల మహేష్, బాసగర్ల అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చిలుపూర్, సెప్టెంబరు 20 : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని చిలుపూర్ ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్నపెండ్యాల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే క్రమశిక్షణతో చదువుతూ ప్రతీ పాఠ్యాంశంపై పట్టు సాధించాలన్నారు. ధూమపానం (సిగరెట్), మద్యపానం, గంజాయి, డ్రగ్స్, జూదం, ర్యాగింగ్, బైక్ రైడింగ్స్ తదితర దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే ఎంతటివారైనా శిక్ష తప్పదని హెచ్చరించారు. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు తదితర విషయాలను దృష్టిలో ఉంచుకుని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంపై ప్రతీ విద్యార్థి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం గుడిమళ్ల సంపత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిలుపూర్, సెప్టెంబరు 20 : మండలంలోని చిన్నపెండ్యాలలో ఇటీవల అనారోగ్యం కారణంగా మృతిచెందిన ఇల్లందుల రిక్కీ (22) కుటుంబాన్ని ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతుని తండ్రి, మాజీ సర్పంచ్ ఇల్లందుల రాజేందర్‌తో పాటు, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, మాజీ సర్పంచులు తాళ్ళపల్లి సమ్మ య్య, మామిడాల లింగారెడ్డి, నాయకులు ఆలూరు రవిందర్‌రెడ్డి, ఇల్లందు ల సుదర్శన్, పొన్న శ్రీను, జీడి కోర్నేల్ తదితరులు పాల్గొన్నారు.

వంగాలపల్లిలో తాటికొండ రాజయ్య పరామర్శ

మండలంలోని వంగాలపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెంది న ఆరూరి యాదగిరి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య శుక్రవారం పరామర్శించారు. అనంతరం మృతుని కుమారుడు, బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఆరూరి రవిచందర్‌ను ఓదార్చారు. రాజయ్య వెంట తాటికాయల చిరంజీవి బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పల్లా పరామర్శ

బచ్చన్నపేట: మండలంలోని తమ్మడపల్లిలో ఇటీవల బాదం లక్ష్మ య్య, కుడుదుల బసవయ్యలు మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి రూ. 5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులున్నారు.

జనగామ రూరల్: అనారోగ్యానికి గురై పట్టణంలోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న జనగామ బీఆర్ఎస్ నాయకుడు తిప్పారపు విజయ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ ముస్త్యాల దయాకర్, శ్రీశైలం, గుర్రం నాగరాజు, సందీప్ ఉన్నారు.

ఎర్రబెల్లి పరామర్శ

పాలకుర్తి: మండలంలోని మల్లంపల్లి, పెద్దతండా (బి) గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పసనూరి నవీన్ జరుపుల బాలునాయక్, వెంకన్న తదితరులు ఉన్నారు.

కొడకండ్ల: మండలబలోని రంగాపురానికి చెందిన కుందూరు పురుషోత్తరెడ్డి, రామవరం గ్రామానికి చెందిన దుంబాల లక్ష్మీజీలు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. విషయం తెలిసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సిందె రామోజీ, పేరం రాము, దీకొండ వెంకటేశ్వర్ రావు, మేటి సోమరాములు, బాకీ ప్రేంకుమార్, తదితరులు పాల్గొన్నారు.